సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 5 । మే । 2025



సాగుకు సమాయత్తం..!

రబీ పంటల సాగు పూర్తవడంతో రైతులు మళ్లీ జూన్ నుంచి ఆరంభమయ్యే ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు. 10లో



సంప్రదాయ రుచులు..

మామిడికాయ పచ్చడి, వడియాలు రుచికరమైనవే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి. 10లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం
40° / 26°

జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు పునర్వసు పట్టాభిషేకం



పట్టాభిషేక క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారికి ఆదివారం పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం కమనీయంగా జరిపారు. స్వామివారికి ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన గావించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి చిత్రకూట మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతర పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి ఆర్జిత సేవలు, నిత్యకల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కుళాయిలో నీళ్లురాక భక్తుల ఇక్కట్లు

ఆలయానికి వచ్చిన భక్తులు తొలుత కుళాయిల వద్ద పాదాలను శుభ్రం చేసుకుని తర్వాత అమ్మవారిని దర్శించుకుంటారు. ఆదివారం కుళాయిల ద్వారా నీళ్ల రాకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. నీళ్లులేక స్నానాల గదుల వద్ద, కల్యాణకట్టవద్ద కూడా ఇక్కట్లు ఎదురయ్యాయి. నీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ఈఓకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సౌకర్యంలేక, జనరేటర్ పనిచేయని కారణంగా ఉదయం నీళ్లు రాలేదని, తర్వాత సమీపం నుంచి నీళ్లు తెప్పించి భక్తులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకున్నామని ఈఓ రజనీకుమారి తెలిపారు.

కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి



నివాళులర్పిస్తున్న అధికారులు, కుల సంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట భగీరథ చిత్రపటానికి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇందిర పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు అనిశెట్టి భిక్షపతి, జి.సురేష్, జి.నవీన్, ఎ.కృష్ణ, గుంటి కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

కిన్నెరసానిలో జలవిహారం



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. రిజర్వాయర్‌లో జలవిహారం చేశారు. 535 మంది పర్యాటకులు కిన్నెరసానిలో ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖ రూ.29,600 ఆదాయం లభించగా, 200 మంది బోటు షికారు చేయగా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.10,400 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేంద్రాల్లో తడిసి మొలకెత్తిన ధాన్యం

అన్నదాతకు కన్నీరు..

అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం

- 20 రోజులుగా వెంటాడుతున్న వానలు
- కొనుగోలు కేంద్రాల్లో కాంటాలకు తీవ్ర జాప్యం



బూర్గంపాడు: మోరంపల్లి బంజర కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం



పాల్వంచ రూరల్ : సోములగూడెం కొనుగోలు కేంద్రంలో చేరిన వర్షపు నీరు

బూర్గంపాడు: ఈ ఏడాది యాసంగి వడ్లు అమ్ముకునేందుకు రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అకాల వర్షాలతో అన్నదాతలు అవస్థ పడుతున్నారు. జిల్లాలో ఏప్రిల్ రెండో వారంలో యాసంగి వరికోతలు మొదలైనప్పటి నుంచి అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. రెండు, మూడు రోజులకోసారి కురుస్తున్న వర్షాలు రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మబ్బు పట్టడంతో ఉరుకులు, పరుగులతో ధాన్యం రాశులపై టార్పాలిన్లు పట్టాలు కప్పుకోవటం, మబ్బులు తేలిపోయాక మళ్లీ ధాన్యం ఆరబెట్టుకోవడం నిత్యకృత్యంగా మారింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో కల్లాలు, కేంద్రాల్లో ధాన్యం ఆరేందుకు ఇరవై రోజులు పడుతోంది. ఆరినా కొనుగోళ్లు ఆలస్యమవుతుండటంతో వర్షాలకు మళ్లీ తడుస్తున్నాయి. కొన్నిచోట్ల వరి కోసిన నెలరోజులకు కూడా అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటివరకు సగం కూడా పూర్తికాలేదు. అకాల వర్షాలు, కొనుగోళ్ల జాప్యంతో పలువురు రైతులు పచ్చి వడ్లనే తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముతున్నారు.

భారీ వర్షానికి తడిసిన ధాన్యం

జిల్లాలో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు మండలాల్లో కల్లాల్లో, కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఉరుములు మెరుపులు కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు రాశులపై కప్పిన పరదాలు, టార్పాలిన్లు లేచిపోయాయి. దీంతో కొనుగోలుకు సిద్ధమైన ధాన్యం కూడా మళ్లీ తడిసింది. ఇప్పటికే రెండు మూడు సార్లు తడిసి ఆరబెట్టిన ధాన్యం మళ్లీ తడవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, పాల్వంచ, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో . భారీ వర్షం కురిసింది. కొన్నిచోట్ల ధాన్యపు రాశుల అడుగున నీరు చేరింది. మరికొన్ని చోట్ల ఆరబెట్టిన ధాన్యంలో నీరుపారింది. సిమెంట్ కాంక్రీట్ ప్లాట్‌ఫామ్‌లు లేకపోవటంతో రైతులు పొలాల్లోనే పరదాలు వేసుకుని వడ్లు ఆరబోసుకున్నారు. అకాల వర్షాలతో భూమి నెమ్ముకుని అడుగు భాగంలో వడ్లు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం అమ్ముకునేందుకు రోజులు తరబడి ఉండాలంటే అకాల వర్షాలతో నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. తడిసిన వడ్లను కూడా కొనాలని కోరుతున్నారు.



రెడ్డిగూడెంలో తడిసిన ధాన్యం బస్తాలు (ఇన్‌సెట్) తడిసి మొలకెత్తిన వడ్లు

పాల్వంచరూరల్: అకాల వర్షంతో రైతులకు అపారనష్టం వాటిల్లింది. ఆదివారం ఉదయం రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షానికి మండలంలో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కల్లాల్లో ఉన్న మిర్చి కూడా తడిసి ముద్దయింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేలవాలింది. భారీ వర్షం కారణంగా సోములగూడెంలో కొనుగోలు కేంద్రంలో వర్షపు నీరు చేసి ధాన్యం తడిసింది. రెడ్డిగూడెం కొనుగోలు కేంద్రం వద్ద మూడు రోజులక్రితం యాస నర్సింహారెడ్డికి చెందిన ధాన్యం కొనుగోలు చేసి గోనె సంచుల్లో నింపారు. మిల్లుకు తరలించకుండా జాప్యం చేయడంతో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి వడ్లు తడిసి మొలకలు వచ్చాయని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

చేకూరి కాశయ్య ఆదర్శప్రాయుడు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



చేకూరి కాశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

చుంచుపల్లి: రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న జెడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చేకూరి కాశయ్య అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కాశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కాశయ్య మానవతావాది అని, నేటితరం రాజకీయ నాయకులకు మార్గదర్శకుడని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేకూరి కాశయ్య సేవలు ఎనలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, కృష్ణమోహన్, కోటేశ్వరరావు, రజాక్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు, కొదమ సింహం పాడురంగాచార్యులు, గురుదక్షిణ ఫౌండేషన్ సభ్యులు, చేకూరి కాశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామాజికవర్గం అభివృద్ధి కోసం కృషి చేయాలి: తుమ్మల

సమాజసేవతోపాటు కమ్మ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మినీ కల్యాణ మండపానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. కల్యాణ మండప నిర్మాణానికి చేయూతనందించేందుకు ముందుకొచ్చిన మాచవరం కోటేశ్వరరావును శాలువాతో సన్మానించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, బిక్కసాని నాగేశ్వరరావు, కృష్ణమోహన్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కమ్మ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

95 శాతం ఉత్పత్తి

- నెలవారీ లక్ష్యానికి చేరువగా సింగరేణి
- రెండు ఏరియాల్లో నూరుశాతానికి మించి బొగ్గు వెలికితీత

ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	ఉత్పత్తి శాతం
కొత్తగూడెం	13.06	12.08	93
ఇల్లెందు	3.10	2.55	82
మణుగూరు	9.26	10.88	117
మందమర్రి	2.21	1.55	70
శ్రీరాంపూర్	5.53	5.11	92
ఆర్జీ-1	4.06	2.06	51
ఆర్జీ-2	2.28	4.99	219
ఆర్జీ-3	5.75	5.09	89
బెల్లంపల్లి	3.50	2.73	78
భూపాలపల్లి	3.85	2.69	70
అడ్రియాల	0.15	0.12	84



ఓపెన్‌కాస్ట్ గనిలో వెలికితీస్తున్న బొగ్గు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గత ఏప్రిల్‌లో 95 శాతం మేర బొగ్గు ఉత్పత్తి సాధించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 76 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. గత నెలలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లోని 19 ఓపెన్‌కాస్ట్ గనులకు, 21 భూగర్భ గనుల్లో 52.78 లక్షల టన్నుల లక్ష్యం నిర్దేశించగా 49.19 లక్షల టన్నుల బొగ్గు వెలికితీశారు. 95 శాతం ఉత్పత్తి సాధించారు. భూగర్భ గనుల్లో 67 శాతం, ఓపెన్‌కాస్ట్ గనుల్లో 97 శాతం ఉత్పత్తి నమోదైంది. రానున్న వర్షాకాలంలో ఉత్పత్తి తగ్గే అవకాశం ఉండగా, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో అధికంగా బొగ్గు వెలికి తీయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల 1 నుంచి అధికారులు గనుల వారీగా పర్యవేక్షణ చేపడుతూ, సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఉత్పత్తి పెంచాలని సూచించారు. కాగా సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఏప్రిల్‌లో ఆర్జీ–2 ఏరియా 219 ఉత్పత్తి శాతంతో మొదటి స్థానంలో, మణుగూరు ఏరియా 117 శాతంతో రెండో స్థానంలో నిలిచాయి.

అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలి

గనుల్లో ఎల్‌హెచ్‌డీలు తరచూ మొరాయిస్తున్నాయి. డంపర్లు, డోజర్ల మెయింటెనెన్స్ కూడా తగ్గింది. సంస్థ ఉన్నతాధికారులు మరింత శ్రద్ధ పెడితే 100 శాతం బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం ఉంది.

–రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ

లక్ష్యాలు సాధించాలి

సంస్థ నిర్దేశించిన రోజు, నెలవారీ బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు కచ్చితంగా సాధించాలి. గనుల్లో యాంత్రిక సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. యంత్రాల పని గంటలు పెంచాలి.

–ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (ఆపరేషన్స్)

ప్రశాంతంగా నీట్



కొత్తగూడెం: పరీక్ష కేంద్రం ఎదుట అభ్యర్థులు

- 1,115 మంది అభ్యర్థులకు 1,058 మంది హాజరు
- మూడు కేంద్రాల్లో 57 మంది అభ్యర్థులు గైర్హాజర్
- పటిష్ట బందోస్తు నడుమ ముగిసిన పరీక్ష



అభ్యర్థులకు సూచనలు చేస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్/పాల్వంచ: వైద్య కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన నీట్–2025 ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లోని మూడు పరీక్ష కేంద్రాలు సింగరేణి ఉమెన్స్ కళాశాల, పాల్వంచ నవభారత్ ఏరియాలోని టీడీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించగా, పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. నిబంధనల ప్రకారం పెన్నులు, బెల్టులు, చైన్లు, బ్యాగులు, క్లిప్పులు, చెవిదిద్దులు తదితర వస్తువులు, ఆభరణాలు అనుమతించలేదు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 163ను అమలు చేశారు. కొందరు అభ్యర్థులు గుర్తింపు కార్డుల జిరాక్స్‌లు తెచ్చుకోవడంతో నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆలస్యంగా వచ్చిన ఇద్దరిని అనుమతించని అధికారులు



పాల్వంచ: ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయలేకపోయిన విద్యార్థినులు

టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కళాశాల కేంద్రానికి కొందరు అభ్యర్థులు చివరినిమిషంలో రావడంతో పోలీస్ సిబ్బంది మొదటి తనిఖీ కేంద్రం నుంచి గేటు వరకు బైక్‌లపై ఎక్కించుకుని పంపారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రానికి ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు.

57 మంది గైర్హాజర్

జిల్లాలోని మూడు సెంటర్లలో జరిగిన పరీక్షకు 1,115 మంది హాజరు కావాల్సి ఉండగా 1,058 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 57 మంది గైర్హాజరయ్యారు. సింగరేణి ఉమెన్స్ కళాశాలలో 480 మందికి 455 మంది హాజరు కాగా, పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల సెంటర్‌లో 360 మందికి 347 మంది హాజరు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 275 మందికి 256 మంది హాజరయ్యారు. జిల్లాలో 94.88 హాజరు శాతం నమోదైందని పరీక్షల కోఆర్డినేటర్ జగన్మోహన్‌రాజు తెలిపారు.

కెమిస్ట్రీ ప్రశ్నలు కఠినంగా..



నీట్‌లో కెమిస్ట్రీ ప్రశ్నలు కఠినంగా ఉన్నాయి. మిగతా ప్రశ్నలు అన్నీ రాయగలిగాను. నీట్ పరీక్ష కోసం ముందస్తుగా ప్రిపరేషన్ అయినా కెమిస్ట్రీలో చదవనివి వచ్చాయి. అయినా సాధ్యమైనంత వరకు బాగానే రాశాను.

–శ్రీధర్, రామవరం

ఫిజిక్స్ కూడా కష్టంగానే..



పరీక్షలో కెమిస్ట్రీతో పాటుగా ఫిజిక్స్ ప్రశ్నలు కూడా కఠినంగానే వచ్చాయి. కోచింగ్ తీసుకున్న వారు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో కూడా బాగా రాసి ఉండవచ్చు. కోచింగ్ తీసుకోనివారికి రెండు సబ్జెక్టుల్లో మార్కులు తగ్గే అవకాశం ఉంది.

–నిరోషా, కొత్తగూడెం

క్యూఆర్ కోడ్ ఉపకరించింది



పరీక్ష కేంద్రానికి చేరుకునేందుకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ విధానం బాగుంది. ఇది చాలా మంది అభ్యర్థులకు ఉపకరించింది. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లు సైతం బాగున్నాయి. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

–భాను నాయక్, ఇల్లెందు

అంజన్న మాలధారులు | రామయ్య చెంతకు..

- ఏటా అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు
- భద్రాచలంలో మాల విరమణకు ఆసక్తి
- ముక్కోటి, నవమి తర్వాత రద్దీ వేడుక
- ఈ నెల 22న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు చేయాలని విన్నపం

భద్రాచలం: భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చి శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుంటారు. ఆ రెండు వేడుకల తర్వాత హనుమాన్ జయంతి వేడుకలను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. రామయ్య స్వామికి హనుమాన్ వీర భక్తుడు కావడంతో ఇటీవల కాలంలో ఆంజనేయ మాలధారులు అధిక సంఖ్యలో భద్రగిరి వస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు భద్రాద్రి రామయ్య చెంతన ఇరుముడి విరమిస్తున్నారు. సుమారు వారం రోజులపాటు 50 వేల మందికి పైగానే స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో హనుమాన్ జయంతి క్రమంగా ఉత్సవంగా మారుతోంది. ఈ నెల 22న హనుమాన్ జయంతి నిర్వహించనుండగా, భద్రాచలంలో కనీస ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

భజనలకు వేదికేది..?

మాలవిరమణకు వచ్చిన భక్తులు తొలుత పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు. అనంతరం టికెట్‌తో ప్రధాన దేవస్థానంలోని ఆంజనేయస్వామి ఉపాలయంలో మాలవిరమణ చేస్తారు. ఉపాలయం కావటంతో రద్దీ ఉంటోంది. సామూహిక మాల విరమణ కోసం తగిన హాల్ లేదు. మాల విరమణ టికెట్‌తోనే ఉచిత దర్శనం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. రామయ్య చెంతన భజన, హనుమాన్ చాలీసా పారాయణం చేసేందుకు వేదిక లేదు. చిత్రకూట మండపంలో అవకాశం ఉన్నా ఇటీవల స్వామివారికి దాతలు సమర్పించిన బంగారు పూత వాహనాలు అక్కడ ఉంచటంతో, అక్కడ జరిగే కార్యక్రమాలను నిలిపివేశారు. కేవలం రద్దీ సమయంలో నిత్యకల్యాణం అక్కడ జరుపుతున్నారు. హనుమాన్ జయంతికి కనీసం వారం రోజుల ముందే దేవస్థానం అధికారులు భజన మందిరం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఏటా స్వామివారి ప్రసాదం, లడ్డూల విక్రయ కేంద్రాల వద్ద తొక్కిసలాట జరుగుతోంది. ఈ నేపథ్యంలో ప్రసాదాల విక్రయాలకు తాత్కాలిక కౌంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వసతులు కల్పిస్తే శబరిమల తరహాలో అభివృద్ధి..

తెలంగాణలో ఆంజనేయ మాల విరమణకు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి, అనంతరం భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి మాత్రమే మాలధారులు తరలివస్తారు. క్రమంగా ప్రధాన ఉత్సవంగా మారుతున్న హనుమాన్ జయంతికి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు, వసతులను కల్పిస్తే మరో శబరిమలగా మారే అవకాశం ఉంది. ముక్కోటి, శ్రీరామనవమిలకు రూ. కోట్లు వ్యయం చేసినా అదే స్థాయిలో ఆదాయం వస్తుంది. హనుమాన్ మాలధారులకు కూడా కనీస వసతులు కల్పిస్తే ఆలయానికి ఆదరణ, హుండీ ఆదాయం భారీ స్థాయిలో పెరిగే అవకాశం ఉంది. పరోక్షంగా స్థానికులకు ఉపాధి కూడా దొరుకుతుంది. ఇప్పటికైన దేవాదాయ శాఖ స్పందించి హనుమాన్ మాలధారులకు తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.



దేవస్థానంలో హనుమాన్ మాలధారుల రద్దీ(ఫైల్)

క్లుప్తంగా

ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తున్నా..

● ఎంపీ రామసహాయం రంఘురాంరెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్‌: తన పార్లమెంట్‌ నియోజక వర్గ పరిధిలోని ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో వినిపిస్తూ, వాటి పరిష్కారం దిశగా పనిచేస్తున్నానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమది తొలి నుంచి ప్రజలతో ముడిపడిన జీవితమని, మున్నేరు వరదలప్పుడు సైతం అనేక కాలనీల్లో సహాయక చర్యల్లో పాల్గొని, నిత్యావసరాలు పంపిణీ చేశానన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా జాతీయ రహదారులు, సర్వీస్‌ రోడ్లు, అండర్‌పాస్‌ల రూపకల్పనకు కృషిచేశానని, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌ అంశాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తాను తిరిగి ఫైల్‌ తెరిపించి విమానయాన శాఖ అధికారులను సర్వేకు పిలిచానని పేర్కొన్నారు. పాలేరులో ప్రత్యామ్నాయ రైల్వే రూట్‌, పులిగుండాల ఎకో టూరిజం పార్క్‌, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలపై తాను గళం విప్పానని స్పష్టం చేశారు.

ఉపాధి కోసం వెళ్లి విగతజీవులుగా మారి..

● చోరీ ఘటనలో హత్యకు గురైన వృద్ధ దంపతులు

ఇల్లెందురూరల్‌: మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు కనకయ్య, రాజమ్మ ఉపాధి కోసం హైదరాబాద్‌లోని ఆల్వాల్‌ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. అక్కడే అపార్ట్‌మెంట్ల వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు రాంబాబు, రమేష్‌ ఉన్నారు. చిన్న కుమారుడు ఉపాధి కోసం హైదరాబాద్‌కు మకాం మార్చడంతో వృద్ధ దంపతులు అతన్ని అనుకరిస్తూ అక్కడికే వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు వృద్ధ దంపతులను హత్య చేసి వారి వద్ద ఉన్న బంగారం, డబ్బులను అపహరించుకెళ్లారు. ఉపాధి కోసం వెళ్లి విగత జీవులుగా మారడం పట్ల గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ కలప పట్టివేత



పట్టుబడిన కలప

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామంలో గోదావరి ఒడ్డున అక్రమంగా నిల్వ ఉంచిన కలపను ఆదివారం ఎఫ్‌ఆర్‌ఓ రమేష్‌ ఆధ్వర్యాన ఫారెస్ట్‌ అధికారులు పట్టుకున్నారు. దీని విలువ సుమారు రూ.1.20లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

బొగ్గు టిప్పర్‌ బోల్తా..




బోల్తా పడ్డ టిప్పర్‌

మణుగూరు టౌన్‌: బొగ్గు లోడ్‌తో వెళ్తున్న ఓ టిప్పర్‌కు పశువులు అడ్డుగా రావడంతో బోల్తా పడింది. ఆదివారం ఉదయం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను స్థానికుల ఇలా తెలిపారు. మణుగూరు నుంచి బీటీపీఎస్‌కు బొగ్గు లోడుతో వెళ్తున్న టిప్పర్‌కు మండలపరిధి రామానుజవరం ఊరి చివరన గేదెలు అడ్డుగా రావడంతో వాటిని తప్పించబోయే క్రమంలో పక్కనే కాల్వలోకి వెళ్లడంతో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● భార్య మృతి.. భర్త, కుమార్తె పరిస్థితి విషమం



సంధ్య (ఫైల్‌)



చికిత్స పొందుతున్న సాడియం బ్రహ్మ

ఏన్కూరు: బైక్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో వివాహిత మృతిచెందగా.. ఆమె భర్త, కుమార్తె పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రామ తండాకు చెందిన సాడియం బ్రహ్మ ఆయన భార్య సంధ్య, కూతురు అమృత కలిసి ద్విచక్రవాహనంపై ఏన్కూరు ప్రధాన సెంటర్‌కు రాగానే మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. స్థానికులు 108 ద్వారా ముగ్గురిని ఆస్పత్రికి తరలిస్తుండగా సంధ్య (38) మృతి చెందింది. భర్త, కూతురు పరిస్థితి కూడా విషమంగా ఉంది. ఘటనా స్థలానికి ఎస్‌ఐ రఫీ చేరకుని, కేసు నమోదు చేశారు.

పామాయిల్‌ గెలలు



టన్ను ధర	రూ.20,058

సాగుకు సమాయత్తం..!

ముగిసిన యాసంగి పనులు

- ముందే పంట పొలాలను సిద్ధం చేసుకుంటున్న ఏజెన్సీ వాసులు
- వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు యత్నాలు
- యాజమాన్య పద్ధతులు మేలంటున్న వ్యవసాయాధికారులు



వేసవి దుక్కులు చేస్తున్న ట్రాక్టర్‌

చర్ల: ఖరీఫ్‌, రబీ పంటల సాగు పూర్తవ్వడంతో రైతులు కాస్తా ఉపశమనం పొందుతూనే మళ్లీ జూన్‌ నుంచి ఆరంభమయ్యే ఖరీఫ్‌ పనుల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యాన ఉదయం, సాయంత్రం వేళల్లో మిర్చి, పత్తి పంట పొలాలను సందర్శిస్తూ సాగుకు అవసరమయ్యే పనులను చేపడుతున్నారు. ప్రస్తుతం మెట్ట, మాగాణి భూములన్నీ ఖాళీగా ఉండగా.. రైతులు కొన్ని యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

భూసారం పెంపునకు ప్రయత్నాలు..

జూన్‌ నుంచి పంటల సాగు చేసేందుకు రైతులు మళ్లీ సమాయత్తమవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది 1.70 లక్షల ఎకరాల్లో వరి, 33 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2 వేల ఎకరాల్లో పెసర పంటలు సాగు చేయగా, 2.02 లక్షల ఎకరాల్లో పత్తి, 15,550 ఎకరాల్లో మిర్చి పంటలు సాగు చేశారు. అయితే పత్తి, మిర్చి పంటలను సాగు చేసిన రైతులు మోట్లు నరకడం, పంట చేలను శుభ్రం చేయడం వంటి పనులు కొనసాగిస్తూ భూసారాన్ని పెంచేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండగా.. పంట చేలల్లో ట్రాక్టర్ల ఫ్లవ్‌లతో లోతుగా వేసవి దుక్కులు చేయడం వంటి పనులకు ఉపక్రమిస్తున్నారు. భూమిని 25–30 సెంటీమీటర్ల లోతు దున్నుకుంటే మంచి ఫలితాలను పొందొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు.

వేసవి దుక్కులతో లాభాలు

వేసవిలోనే భూమిని లోతుగా దున్నడంతో వర్షాకాలంలో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండా చేస్తుంది. భూమి పైపొరలు తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో తేమశాతం పెరిగి, భూసారం వృద్ధి చెందుతుంది. పురుగులు, తెగుళ్లు, కలుపు నివారణ చేసుకోవచ్చు. దుక్కులు దున్నే ముందు పొలంలో గొర్రెలు, మేకలు, పశువుల మందలు తోలడం వలన వాటి విసర్జన పదార్థాలు భూసారాన్ని పెంచుతాయి. పశువుల పెంటపోగు, కంపోస్టు ఎరువులు, చెరువులోని పూడిక మట్టి వేయడంతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పంటలు చేతికి వచ్చే ముందు ఎండు ఆకులు, చెత్త చెదారాన్ని కాల్చివేయకుండా వాటిని పొలంలోనే కలిసిపోయేలా దున్నితే ఎరువుగా మారుతుంది. కలుపు మొక్కలు పంటల దిగుబడిని తగ్గిస్తున్న నేపథ్యాన లోతుగా దున్నడంతో అవి నేల పైకి వచ్చి అధిక ఉష్ణోగ్రతలతో నశించి తదుపరి సాగుకు బెడద తగ్గే అవకాశాలు ఉంటాయి.

దుక్కులు దున్నకపోతే నష్టాలే..

యాసంగి పంటల కోతల తర్వాత భూమిని వదిలేస్తే కలుపు మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరిగి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి భూమికి సత్తువ లేకుండా చేసి భూసారాన్ని తగ్గిస్తాయి. భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరై పోతుంది. వేసవి దుక్కులు లేకుంటే తొలకరి వాన నీరు భూమిలోకి ఇంకకుండా పోతుంది. వర్షాలతో భూమి కోతకు గురవుతుంది. ఖాళీ భూముల్లో చీడపురుగులు భారీగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా రాబోయే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

వేసవి దుక్కులతో మేలు



వానకాలం, యాసంగి సీజన్లలో పంటల సాగు పూర్తయిన తరువాత తప్పనిసరిగా పొలాన్ని దున్నాలి. లేకుండా పంటలకు నాశనం చేసే పురుగులు వృద్ధి చెందుతాయి. దుక్కులు చేసే ముందు పశువుల పెంట సేంద్రియ ఎరువులను వేస్తే పొలానికి మరింత బలం చేకూరి అధిక దిగుబడికి దోహదపడుతుంది.

– లావణ్య, ఏఓ, చర్ల

చికిత్స పొందుతూ మహిళ మృతి



గుగులోత్‌ బుల్లి(ఫైల్‌)

జూలూరుపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ బాదావత్‌ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బేతాళపాడు గ్రామ పంచాయతీ పీక్లా తండాకు చెందిన గుగులోత్‌ బుల్లి(58), ఆమె సోదరుడు బానోత్‌ కసనతో కలిసి శనివారం బైక్‌పై పని నిమిత్తం పడమటనర్సాపురం వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో రేగళ్లతండా గ్రామ శివారులోని కోళ్ల ఫారమ్‌ వద్దకు రాగానే వెనుక నుంచి కారు ఆ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బుల్లికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు అప్పునాయక్‌ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌ బానోత్‌ రవిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి..

ములకలపల్లి: పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సత్యంపేట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం ..గ్రామానికి చెందిన సవలం శివ(32) భార్య నాగమణితో కలసి జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమాన మద్యానికి బానిసైన ఆయన గురువారం గ్రామ శివారులోని మామిడితోటలో పురుగుల మందు సేవించాడు. గమనించిన సమీపస్తులు హుటాహుటిన పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రాథమిక చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు తెలిపారు.

ఖమ్మం మహిళ హైదరాబాద్‌లో..

భర్తే కొట్టి చంపాడని అనుమానాలు



భర్త అనిల్‌తో సాహితి (ఫైల్‌)

ఖమ్మంక్రైం: వరుసకు వదిన అయిన మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్న ఓ వ్యక్తి తన భార్యను కొట్టి చంపినట్లు సమాచారం. ఈ ఘటన హైదరాబాద్‌లో జరగగా.. మృతురాలిది ఖమ్మం. వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణానికి చెందిన సాహితి (30)కి ఖమ్మం పట్టణానికి చెందిన రేగుల అనిల్‌తో కొన్నేళ్ల కిందట వివాహమైంది. అనిల్‌ హైదరాబాద్‌లోని పోలీస్‌ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా పనిచేస్తుండటంతో దంపతులు అక్కడే ఉంటున్నారు. కాగా, అనిల్‌ వరుసకు వదిన అయిన మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా దంపతుల మధ్య గొడవలు మొదలయ్యాయి. పద్ధతి మార్చుకోవాలని పెద్దల సమక్షంలో హెచ్చరించినా మార్పు రాలేదు. శనివారం రాత్రి సాహితిని విపరీతంగా కొట్టడంతో ఆమె మృతిచెందగా గుండెపోటుతో మృతిచెందినట్లు చిత్రీకరించేందుకు అనిల్‌ యత్నించాడని మృతురాలి బంధువులు ఆరోపించారు. మృతురాలి శరీరంపై కూడా గాయాలున్నాయని, హైదరాబాద్‌ నుంచి మృతదేహాన్ని తీసుకొచ్చి ఖమ్మం టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నా చేశారు. సీఐ బాలకృష్ణ వారితో మాట్లాడి అనిల్‌పై ఫిర్యాదు చేయాలని, పోస్టుమార్టంలో హత్య అని తేలితే కేసు నమోదు చేస్తామని, సర్దిచెప్పగా మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. టూటౌన్‌ పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. అనిల్‌ పరారీలో ఉన్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు.

తక్కువ ధరకు బంగారం అంటూ టోకరా..

సినీ ఫక్కీలో రూ.10 లక్షలు చోరీ

కారేపల్లి: తక్కువ ధరకు.. ఎక్కువ బంగారం.. అంటూ ఆశచూపిన కేటుగాళ్లు నకిలీ బంగారం అంటగట్టి.. రూ.10 లక్షలు చోరీ చేసిన ఘటన కారేపల్లిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. బస్టాండ్‌ సెంటర్‌కు చెందిన ఓ జ్యూస్‌ పాయింట్‌ వ్యాపారికి ఓ సైబర్‌ దుండగుడు ఫోన్‌ చేసి.. 'సార్‌.. మీ మొబైల్‌ నంబర్‌కు బంగారం ఆఫర్‌ వచ్చింది. ఏపీలోని ఏలూరులో 20 తులాల బంగారం కేవలం రూ.10 లక్షలే'అని తెలిపాడు. వారం రోజులుగా పదే పదే ఫోన్‌ చేసి.. అలాగే చెప్పారు. దీంతో బాధితుడు ఆఫర్‌ను వదులుకోవద్దని ఖమ్మంలో తనకు తెలిసిన, ఓ బంగారం దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న తన స్నేహితుడు, రూ.10 లక్షలు తీసుకుని కారులో ఏలూరు వెళ్లారు. ఓ అపార్ట్‌మెంట్‌లో దుండగులను కలవగా.. వారు సూట్‌కేసులో 20 తులాల బంగారం పెట్టి ఇచ్చారు. బాధితుడి వెంట వచ్చిన వ్యక్తికి బంగారం షాపులో పనిచేస్తున్న అనుభవం ఉండటంతో పరీక్షించి ఒరిజినలే అని భావించి, తూకం వేశారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న ఒకడు పోలీసులు వస్తున్నారని అరిచాడు. అనంతరం సూట్‌కేసులు తారుమారు చేశారు. బాధితులు అక్కడి నుంచి కారు ఎక్కి తిరుగు పయనమయ్యారు. ఏలూరు దాటాక కారు ఆపి సూట్‌కేసు తెరిచి చూడగా నకిలీ బంగారపు వస్తువులు చూసి ఖంగుతున్నారు. తిరిగి అక్కడికే వెళ్లగా వారు లేకపోగా.. ఫోన్‌ కూడా కలవలేదు. కానీ, బాధితులు ఇప్పటివరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు.

పిడుగుపాటుతో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధిత కుటుంబం

ములకలపల్లి: పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధమైన సంఘటన మండలపరిధిలోని చలమన్న నగర్‌ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పాతగుండాలపాడు జీపీలోని చలమన్ననగర్‌కు చెందిన పర్సిక సీతయ్య గ్రామ శివారులో ఇటీవల నూతనంగా పూరిల్లు నిర్మించుకున్నాడు. ఆదివారం ఉరుములు మెరుపులతో వర్షం కురిసిన సమయాన అతడి పూరిల్లుపై పిడుగు పడి పూర్తిగా దగ్ధమైంది. మరో రెండు రోజుల్లో ఇంట్లోకి వెళ్లే తరుణాన ఇలా అగ్నికి ఆహుతైందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరాడు.

మణుగూరులో రెండు ఇళ్లల్లో చోరీ..

● రూ.1.30లక్షల నగదు, తులం బంగారంతో ఉడాయింపు

మణుగూరు టౌన్‌: పట్టణంలో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో బియ్యం, బంగారం, డబ్బు చోరీ చేసిన సంఘటన ఆదివారం ఉదయం సుందరయ్యనగర్‌లో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఎస్‌కె.హసీనా పట్టణంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో పనిచేస్తుండగా.. శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లి ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉంది. దీంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువాలోని రూ.1.30లక్షల నగదు, తులం బంగారం, 20 తులాల వెండితో పాటు కింటా బియ్యం, 10 చీరలు చోరీకి గురైనట్లు గుర్తించి స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే విధంగా హసీనా ఇంటికి రెండు ఇళ్ల పక్కనే ఉన్న గణేశ్‌ కుటుంబంతో కలిసి శనివారం సాయంత్రం అశ్వాపురం మండలానికి వెళ్లి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. దీంతో ఇంట్లోని బీరువాలో ఉన్న వెండి సామగ్రి, పిల్లల దుస్తులు, బొమ్మలు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సంఘటనా స్థలాలను ఏడూళ్లబయ్యారం సీఐ, మణుగూరు ఇన్‌చార్జ్‌ సీఐ వెంకటేశ్వరరావు, మణుగూరు ఎస్‌ఐ రంజిత్‌లు సందర్శించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టి.. జాగిలాలతో గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మధిర: దెందుకూరు రైల్వే ఓవర్‌ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మట్టగుంజ సతీశ్‌ (23) మధిర పట్టణంలోని ఫర్నిచర్‌ దుకాణంలో పనిచేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై మధిర నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా రైల్వే ఓవర్‌ బ్రిడ్జిపై ఎదురుగా వచ్చిన టాటా ఏస్‌ వాహనం ఢీకొట్టింది. సతీశ్‌ అక్కడికక్కడే మృతి చెందగా.. సమాచారం అందుకున్న ఆర్కే ఫౌండేషన్‌ అధ్యక్షులు దోర్నాల రామకృష్ణ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్‌ ఎస్‌ఐ లక్ష్మీభార్గవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం!

మధిర: పట్టణంలోని స్టేషన్‌రోడ్‌లో బాలికపై సమీప బంధువు శనివారం రాత్రి లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. స్థానిక శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉంటున్న ఓ మహిళ పలు ఇళ్లలో పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. కుమారుడు కూలి పనులకు వెళ్తుంటాడు. కుమారుడికి కిడ్నీలో స్టోన్‌ ఉండగా చికిత్స కోసం శనివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి వెళ్లారు. బాలిక ఇంట్లో ఉండగా తన చిన్నమ్మ భర్త (బాబాయి) శనివారం రాత్రి ఇంటికి వచ్చి లైంగికదాడికి యత్నించినట్లు సమాచారం. బాలిక కేకలు వేయడంతో సదరు వ్యక్తి పరారయ్యాడు. ఆదివారం బాలిక తల్లి మధిర టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

సంప్రదాయ రుచులు.. ఆరోగ్య గుణాలు!



వడియాలు వేస్తున్న దృశ్యం



సిద్ధమైన నిమ్మకాయ పచ్చడి



పచ్చడి తయారీకి మామిడికాయలు కోస్తూ...

- పచ్చళ్లు, వడియాల సన్నాహాలతో ప్రత్యేక సందడి
- సంస్కృతుల మేళవింపు.. వేసవి రుచుల సమాహారం
- ఏడాది పొడవునా ఆస్వాదించేలా తయారీ

కరకగూడెం: వేసవి కాలం వచ్చిందంటే చాలు ఏజెన్సీ గ్రామాల్లో మామిడికాయల సుగంధం, పచ్చడి తయారీ, వడియాల సన్నాహాలతో ఒక ప్రత్యేకమైన సందడి నెలకొంటుంది. ఇవి కేవలం ఆహార పదార్థాలు మాత్రమే కాదు సంప్రదాయం, కుటుంబ బంధాలు, గ్రామీణ సంస్కృతి సజీవ చిహ్నాలు. పచ్చళ్లు ఆహార సంస్కృతిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి రుచిని పెంచడమే కాక ఆహారాన్ని సంరక్షించే సంప్రదాయ పద్ధతిగా కూడా పనిచేస్తాయి. గిరిజన గ్రామాల్లో ఆవకాయ పచ్చడి లేని ఇల్లు ఉండదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఉదాహరణకు బెల్లం ఆవకాయ, మెంతి ఆవకాయ, పులిహోర ఆవకాయ వంటి రకాలు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటాయి. ఈ ప్రక్రియలో కుటుంబ సభ్యులందరూ పాల్గొనడం, పాత తరం నుంచి కొత్త తరానికి జ్ఞానాన్ని అందించడం వంటివి సాంస్కృతిక సంబంధాలను బలపరుస్తాయి.

పచ్చడి తయారీ విధానం..

- గట్టిగా, పుల్లగా ఉన్న పచ్చి మామిడి కాయలను ఎంచుకుని లోపల టెంకలు తీసి ముక్కలుగా కోయాలి.
- ఆవపిండి, ఎండుమిరపకాయల కారం, ఉప్పు, మెంతిపొడి, నువ్వుల నూనె వంటి ప్రధాన పదార్థాలు కలిపేందుకు సిద్ధం చేసుకోవాలి. కొన్ని రకాల్లో బెల్లం లేదా వెల్లుల్లి కూడా కలుపుతారు.
- ఆ తరువాత జాడీలో కారం మిశ్రమాన్ని మామిడి ముక్కలతో పొరలు పొరలుగా అమర్చి, పైన నూనె పోస్తారు. ఇది పచ్చడిని పాడవకుండా సంరక్షిస్తుంది.
- 34 రోజుల పాటు గాలిచొరబడకుండా మూత పెట్టి ఉంచిన తర్వాత, పచ్చడి తినడానికి తయారవుతుంది. కొన్ని రకాలు ఎండబెట్టి దీర్ఘకాల నిల్వకు సిద్ధం చేస్తారు.

వడియాలతో ఆర్థిక స్వావలంబన..

వడియాల తయారీలో మినపప్పు, బియ్యం, సగ్గుబియ్యం వంటి పదార్థాలను వినియోగిస్తుంటారు.

- మొదటగా పప్పును నానబెట్టి, రుబ్బి, ఉప్పు, జీలకర్ర, కారం వంటి సుగంధ ద్రవ్యాలు కలిపి, చిన్న చిన్న గుండ్రని ఆకారాల్లో చాపలపై ఎండబెడతారు.
- ఈ ప్రక్రియ సాధారణంగా ఉదయం త్వరగా మొదలై సూర్యకాంతి తగినంతగా ఉన్న సమయంలో పూర్తవుతుంది. ఇవి కొన్ని చోట్ల వీటిని తయారు చేసి మార్కెట్లలో విక్రయిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో యంత్రాలతో తయారైన వడియాలు రావడంతో కొన్ని గ్రామాల్లో సంప్రదాయం తగ్గుతూ వస్తోంది.

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

మామిడికాయ పచ్చడి, వడియాలు రుచికరమైనవే కాకుండా కొన్ని ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. అయితే వీటిని మితంగా తీసుకోవడం ముఖ్యం. పచ్చి మామిడిలో పొటాషియం, ఇతర ఖనిజాలు వల్ల వేసవిలో డీహైడ్రేషన్‌, జీర్ణక్రియను మెరుగుపరచ్చడం, మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తాయి. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని వ్యాధుల నుంచి కాపాడతాయి. జీలకర్ర లేదా ఇంగువ వడియాలు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి.

ఏడాది పొడవునా రుచిని ఇస్తుంది..



ప్రతి సంవత్సరం వేసవిలో మామిడి కాయల పచ్చడి చేయడం మాకు ఒక పండుగలా ఉంటుంది. కుటుంబ సభ్యులందరం కలిసి తయారీలో పాల్గొంటాం. మాకు ఏడాది పొడవునా రుచిని ఇస్తుంది. అలాగే మా కుటుంబ బంధాలను కూడా బలపరుస్తుంది.

– కొత్తకొండ సత్యవతి, కరకగూడెం

కాయల ఎంపిక చాలా ముఖ్యం..



మామిడికాయ పచ్చడి తయారీకి కాయల ఎంపిక చాలా ముఖ్యం. ఇందు కోసం నేనే మామిడి తోటకు వెళ్లి పుల్లగా ఉన్న కాయలనే కోసి తీసుకొస్తాను. తర్వాత వాటిని శుభ్రంగా కడిగి ముక్కలు చేసి మసాలా ఉప్పు, కారం, ఆవాలు వేసి బాగా కలిపి జాడీల్లో పెడతాం.

– ఎం.డీ.గౌస్‌మియా, పద్మాపురం

వడియాలు రుచిగా ఉంటాయి..



ఎండాకాలంలో వడియాలు తయారు చేయడం ఒక పెద్ద పండుగ. బియ్యం పిండి, సగ్గుబియ్యం, శనగపిండి వంటి వాటితో రకరకాల వడియాలు తయారు చేస్తాం. కూరలు, పప్పులు ఇంకా ఇతర వంటకాల్లో వేసుకుంటే చాలా రుచిగా ఉంటాయి. ఇవి మాకు ఏడాది పొడవునా ఆహారంలో ఉపయోగపడతాయి.

– ముత్యాల రమాదేవి, కుర్నవల్లి